బావిలోంచి బాలుడి మృతదేహం వెలికితీత

విగత జీవిగా కనిపించడంతో మిన్నంటిన తల్లి రోదన



బాలుడి మృతదేహం

మూసాపేట: చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడిన బాలుడి మృతదేహాన్ని శుక్రవారం వెలికి తీశారు. కూకట్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒంగోలు కావలికి చెందిన నాగమణి హైదర్‌నగర్‌లో ఉంటూ చిన్న పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. భర్త తాగుడుకు బానిసై కుటుంబాన్ని సరిగ్గా చూసుకోకపోవంతో బాబు సందీప్(13) బాలాజీనగర్‌లోని శాంతి భూషణ్ బ్లెస్డ్ హోమ్‌లో జాయిన్ చేశారు. కూతురిని తన వద్దే ఉంచుకొని చదివిస్తోంది. పాప 6వ తరగతి చదువుతోంది.

◆ గత సంవత్సరం జూన్‌లో సందీప్‌ను జాయిన్ చేయటంతో 7వ తరగతి చదువుతున్నాడు. గోడ అవతల నెమళ్లు ఉంటాయని చూసేందుకు మరో ఇద్దరు స్నేహితులతో కలిసి వెళ్లాడు. కొన్ని నెమలి ఈకలను సేకరించి ముందుకు వెళ్లారు. బావిలో చేపలు కనిపించడంతో పట్టుకోవడానికి వెళ్లి బావిలో ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. పక్కనే ఉన్న ఇద్దరు చిన్నారులు కాపాడేందుకు ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది.

◆ స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు డీఆర్‌ఎఫ్ బృందం సహాయంతో రాత్రి వరకు వెతికినా మృతదేహం దొరకలేదు. శుక్రవారం ఉదయం తిరిగి డీఆర్‌ఎఫ్ బృందం, అగ్నిమాపక శాఖ సిబ్బంది, పోలీసులు కలిసి వెతికి మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. భర్త తాగుడుకు బానిస కావడంతో కొడుకును మంచిగా చదివించాలనుకున్నా తల్లికి కొడుకు విగత జీవిగా కనిపించడంతో ఆ తల్లి రోధనలతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి.



ఇఫ్తార్

సర్దార్‌నగర్‌లో జరిగినలో ఇఫ్తార్‌లో మల్కాజ్‌గిరి బీఆర్‌ఎస్ లోక్‌సభ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

మోతీనగర్: హిందూ, ముస్లిం ఐక్యతకు నిదర్శనం ఇఫ్తార్ విందు అని బీఆర్‌ఎస్ పార్టీ మేడ్చల్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అల్లాపూర్ డివిజన్ సర్దార్‌నగర్‌లో సంక్షేమ సంఘం అధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ అమీద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ముస్లింల అభివృద్ధికి బీఆర్‌ఎస్ పార్టీ విశేష కృషి చేస్తుందన్నారు. గతంలో ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌కి దక్కిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ బీఆర్‌ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి తన విజయానికి కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ సబిహా బేగం, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మొహమ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, నాయకులు షరీఫ్ ఖురేషి, అహ్మద్, సలీం, ఎస్‌కే రఫిక్, జ్ఞానేశ్వర్, యోగిరాజ్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగించండి



వివేకానందనగర్ రామకృష్ణ వీధిలో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని రామకృష్ణ వీధి పెద్దమ్మ తల్లి దేవాలయం పరిసర ప్రాంతాల్లో వీధుల వెంట చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. జీహెచ్‌యంసి సిబ్బంది సైతం తాము సేకరించిన చెత్తా చెదారాన్ని తీసుకువచ్చి ఇక్కడే పడవేయటంతో అది కాస్తా చెత్త డంపింగ్ ప్రాంతంగా తయారైంది. రెండు నెలలుగా జీహెచ్‌యంసి సిబ్బంది చెత్త కుప్పలను దూర ప్రాంతానికి తరలించకుండా అక్కడే ఉంచటంతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రామకృష్ణ వీధిలో శుభ్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

2047 కల్లా దేశంలో అధిక శాతం విద్యావంతులు

- ఏఐసీటీఈ చైర్మన్ ప్రొ. టీజీ. సీతారాం
- వందలో 50మంది విద్యార్థులను ఇంజినీర్లుగా చేయడమే లక్ష్యం



జేఎన్‌టీయూలో జరిగిన సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఏఐసీటీఈ చైర్మన్ ప్రొ. టీజీ. సీతారాం, వీసీ ప్రొ. కట్టా నరసింహారెడ్డి తదితరులు

బాలానగర్: జేఎన్‌టీయూలోని ఆడిటోరియంలో అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘ్ (ఏబీఆర్‌ఎస్‌ఎం), తెలంగాణ రాష్ట్రం అసోసియేషన్, జేఎన్‌టీయూ హైదరాబాద్ సహకారంతో ''నావిగేటింగ్ ది అపర్చునిటీస్ ఇన్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఫర్ ఫ్యూచర్''భారత్ అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా ప్రొ. టీజీ సీతారాం, చైర్మన్, ఏఐసీఈటీ న్యూఢిల్లీ, గుట్టా లక్ష్మణ్‌జీ, వీసీ కట్టా నరసింహారెడ్డి, ప్రొ. ఎంకే మాలి, సీనియర్ ప్రొ. ఎంఎన్‌ఐటీ జైపూర్, ప్రిన్సిపాల్ డా. అశోక్ హాజరై ప్రసంగించారు. అంతకు ముందు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి అతిథులు నివాళులర్పించారు.

◆ ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఆయన స్వతంత్ర పోరాటంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొని దేశం కోసం నిలబడిన వ్యక్తి, వీరు రాజ్యాంగం రచనలో కూడా మెంబర్‌గా ఉన్నారని తెలిపారు. ఏఐసీటీఈ చైర్మన్‌గా సీతారాం బాధ్యతలు చేపట్టిన తరువాత ఇంజినీరింగ్ విభాగంలో సులభతరంగా కళాశాలలకు అనుమతులు ఇచ్చే విధంగా పెనుమార్పులు చేశారన్నారు.

◆ ఏఐసీటీఈ చైర్మన్ సీతారాం మాట్లాడుతూ... 2047 కల్లా దేశంలో అధిక శాతం విద్యావంతులు, స్వతంత్ర పరిశ్రమలు పెట్టుకునే విధంగా, పెద్ద సంఖ్యలో ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా ఏఐసీటీఈ ప్రణాళిక తయారు చేసిందన్నారు. స్కూల్ స్థాయి నుంచి ప్రస్తుతం సుమారు 100 మంది విద్యార్థులు బయటకు వస్తే వారిలో సుమారు 25 మంది విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యార్థులుగా మారుతున్నారని తెలిపారు. వీరిని 2035 నాటికి 50 మంది విద్యార్థులను తీసుకురావాలనే మార్పు కోసం ఏఐసీటీఈ కృషి చేస్తోందన్నారు. విద్యార్థులను సమాజంలో ఉత్తమ ఇంజినీర్లుగా ఎలా తీర్చిదిద్దాలో ఈ సదస్సులో పాల్గొన్న సుమారు వేయి మంది అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లకు వివరించారు.

ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఏఐసీటీఈ చైర్మన్ ప్రొ. టీసీ సీతారాం, వీసీ కట్టా నర్సింహారెడ్డి

బాలానగర్: ఏఐసీఈటీ చైర్మన్ ప్రొఫెసర్ టీసీ సీతారాం, ఎంకే మాలి, సీనియర్ ప్రొఫెసర్ ఎంఎన్‌ఐటీ జయపూర్ శుక్రవారం యూనివర్సిటీలోని వివిధ విభాగాల డైరెక్టర్లు కలిసి జేఎన్‌టీయూలో వైస్‌చాన్సలర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆ తర్వాత జే-హబ్‌లో ఏర్పాటు చేసిన ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్‌ను సీతారాం ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఆధునిక యంత్రాలను పరిశీలించారు. ఆయన వెంట వీసీ కట్టా నర్సింహారెడ్డి, రెక్టార్ డా. కె.విజయకుమార్‌రెడ్డి, రిజిస్టర్ డా. కె.వెంకటేశ్వరరావు, డైరెక్టర్ జి.విజయకుమారి, డా.ఆశారాణి, ప్రిన్సిపాల్ జీవీ నర్సింహారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

రాయదుర్గం: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల గృహ సముదాయం గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో కొలువుదీరిన రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం ఉదయం ఆలయంలో నిత్యోపాసన, బలిహరణ మహన్యాస పూర్వక అభిషేకాలు, మహలక్ష్మీకల్పం, నీరాజన మంత్రపుష్పములు నిర్వహించారు. రాజరాజేశ్వరిమాతకు, చంద్రమౌళీశ్వరస్వామి వారికి అభిషేకం అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

నేడు శ్రీవారి కల్యాణం

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాయలంలో దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి శనివారం సాయంత్రం 6.30నుంచి రాత్రి 8.30 గంటల వరకు శ్రీవారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జీఏకే కృష్ణ తెలిపారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారి కల్యాణాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు, రేపు పశువుల సంత

మోతీనగర్: మూసాపేట డివిజన్ బబ్బుగూడలో ప్రతి శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు పశువుల సంత కొనసాగనుంది. రంగారెడ్డి జిల్లా నార్సింగ్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఈ సంత కొనసాగుతుంది. రాష్ట్రంతో పాటు నగరంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు పశువుల క్రయ, విక్రయాలు జరుపుతారు.

పాపిరెడ్డినగర్ బస్తీ కమాన్ నిర్మాణానికి శంకుస్థాపన



బస్తీ కమాన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఊట్ల చంద్రారెడ్డి, బస్తీ వాసులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ బస్తీ ప్రధాన ముఖద్వారానికి శుక్రవారం భూమిపూజ చేశారు. పార్టీలకు అతీతంగా బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ వీరాంజనేయ శివాలయం ప్రధాన అర్చకులు పరాంకుశం వెంకటాచార్యులు బస్తీ వాసులతో ప్రత్యేక పూజలు చేయించి కమాన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చింతల్ ఆర్ఎన్‌సీ ఆసుపత్రి నిర్వాహకులు కమాన్ నిర్మాణానికి సహాయ సహకారాలు అందించనున్నట్లు ఈ సందర్భంగా బస్తీవాసుల తరపున వారికి బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బస్తీ మహిళలు ఆసుపత్రి నిర్వాహకులను శాలువాతో సత్కరించారు.

◆ ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ... బస్తీ అభివృద్ధి ధ్యేయంగా ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించటంతో పాటుగా భావితరాలకు ఉపయోగపడేలా బస్తీ రూపురేఖలను మార్చి సుందరంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. సహకరిస్తున్న ప్రజా ప్రతినిధులకు, బస్తీవాసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, కోశాధికారి నరసింహులు ముదిరాజ్, బస్తీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడ సభను విజయవంతం చేయండి



బాలానగర్: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కూకట్‌పల్లి పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. బాలానగర్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. తుక్కుగూడలో నిర్వహించే జన జాతర సభకు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని అన్నారు. ఈ సభను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని కోరారు.

32 పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాకు మంజూరైన నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలో 32 పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిక వెబ్‌సైట్‌తో పాటు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 6 నుంచి 8 వరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు మేడ్చల్ కలెక్టరేట్ భవన సముదాయాల్లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు. దరఖాస్తుతో మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పేరుతో తీసిన రూ.500 డీడీని జత చేయాలన్నారు. అవసరమైన బోనాఫైడ్ సర్టిఫికెట్లు, విద్యార్హతలు/కుల ధృవీకరణ పత్రాల కాపీలను జత పరచాలని కోరారు.

హెచ్‌సీయూ-ఏఎస్ఎస్ఐల ఒప్పందం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఎస్ఐ)ల మధ్య శాస్త్రీయ అవగాహన, అనుకూలమైన ఫలితాలను ప్రోత్సహించడానికి పరస్పర ఒప్పందం కుదిరింది. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో శుక్రవారం వైస్‌చాన్స్‌లర్ ప్రొ.బీజేరావు, సీనియర్ ప్రొఫెసర్ పాదిలి అప్పారావు సమక్షంలో హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్, ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ ప్రొఫెసర్ బివిశర్మ ఒప్పందంపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ ఆనంద్‌కొండపి, స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ఈన్, ఆర్ అండ్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ సామ్రాట్ సబాత్, ప్రొఫెసర్ హెచ్ఏ నాగరాజారామ్, ప్రొఫెసర్ బివిశర్మ, డాక్టర్ బిపి ఉరడే పాల్గొన్నారు.

చిక్కడపల్లితో శాంతిస్వరూప్‌కు విడదీయని అనుబంధం

చిక్కడపల్లి: దూరదర్శన్ తొలితరం న్యూస్ రీడర్ శాంతిస్వరూప్ చిక్కడపల్లితో విడదీయరాని అనుబంధం ఉంది. 1980 దశకం ప్రాంతంలో ఆయన దాదాపు 30 ఏళ్లు చిక్కడపల్లిలోని తమ సొంతింట్లోనే ఉండేవారు. ఆయన విద్యాభ్యాసం కూడా ఇక్కడే ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాల ఆంధ్రా విద్యాలయంలో జరిగినట్లు తెలుస్తోంది. దాదాపు 2000 సంవత్సరం వరకు ఆయన చిక్కడపల్లిలోనే నివసించి అనంతరం రామాంతపూర్‌కు తరలివెళ్లారని స్థానికులు చెబుతున్నారు. ఆయన ఇటీవలి వరకు త్యాగరాయగానసభ సిటీ సెంట్రల్ లైబ్రరీలో జరిగే పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని సభకు అధ్యక్షత వహించి సభికులు, ప్రేక్షకులు, తోటి వేదికపైన ఉండే పెద్దలను కూడా ఆకట్టుకునేవారు.

టీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉదయశ్రీ

కాచిగూడ: ప్రముఖ విద్యావేత్త ఉదయశ్రీరెడ్డిని తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ (టీసీసీ) రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా నియమించినట్లు కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్‌ముదిరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం బర్కత్‌పురలోని టీసీసీ కార్యాలయంలో ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఉదయశ్రీరెడ్డి ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 20 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణ, శాంతి, మతసామరస్యం, కేన్సర్, క్షయవ్యాధి నివారణ, గుండె జబ్బులు, చక్కెర వ్యాధి, హైపర్ టెన్షన్, జాతీయ సమైక్యత, విద్యార్థిని మహిళా సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



మోతీనగర్: యువ నాయకుడు దేవరింటి మస్తాన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు శుక్రవారం అల్లాపూర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరారు. వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు మొయినుద్దీన్ అధ్యక్షతన జరిగిన సభలో కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ సమక్షంలో వందలాది మంది కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మస్తాన్‌రెడ్డి నాయకత్వంలో డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తిగా మారిందన్నారు. కాలనీవాసుల కోసం మస్తాన్‌రెడ్డి కోరినట్లుగా అల్లాపూర్ వార్డు కార్యాలయంగా వినియోగిస్తున్న వివేకానందనగర్ కమ్యూనిటీహాల్‌ను పూర్తిగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు తూము వేణు, నర్సింహ యాదవ్, రేష్మ, భారతి, కనకయ్య, సుంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పల్లపువేణు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: సికింద్రాబాద్ జిల్లాను ఏర్పాటు చేయాలని శ్రీ ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం సికింద్రాబాద్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు. సికింద్రాబాద్‌లోని 7 అసెంబ్లీ నియోజక వర్గాలు త్వరితగతిన అభివృద్ధి చెందాలంటే జిల్లాను ఏర్పాటు చేయాలన్నారు. సికింద్రాబాద్‌ను జిల్లాగా ప్రకటిస్తే 1,116 కొబ్బరికాయాలను కొట్టి మొక్కుతీర్చుకుంటామని అమ్మావారిని వేడుకున్నట్లు తెలిపారు. బాల్‌రాజ్‌యాదవ్, శైలేందర్, కృష్ణ ముదిరాజ్, అశోక్, శ్రీకాంత్‌రెడ్డి, సునీల్ పాల్గొన్నారు.

ఫోన్ ట్యాంపింగ్‌పై సమగ్ర దర్యాప్తు చేయాలి

తెలంగాణ న్యాయవాదుల జేఏసీ

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలో ఫోన్ ట్యాంపింగ్‌కు పాల్పడిన వారిపై సమగ్ర దర్యాప్తు చేసి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర డీజీపీకి వినతి పత్రాలను సమర్పించామని జేఏసీ నాయకులు తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాసాయాదవ్, కన్వీనర్ బత్తుల కృష్ణలు మాట్లాడుతూ... రాష్ట్రంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారవేత్తలు, సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, పౌరులపై కూడా ఫోన్ ట్యాపింగ్ పాల్పడిన వారిపై సమగ్రంగా విచారణ జరిపించాలని కోరారు. ఆర్టికల్ 27 వ్యక్తిగత స్వేచ్ఛ, దీనిని దుర్వినియోగం చేయరాదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని ఆరోపించారు. రాష్ట్రంలో జరిగే 17 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. జేఏసీ నేతలు జి.విజయకుమారి, జి. రామారావు, అనురాధ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి



బాలానగర్‌లో డా. బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి



ఆల్విన్‌కాలనీ పీజేఆర్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేత మారెళ్ల శ్రీనివాసరావు, బీజేవైఎం నేత కుమార్ యాదవ్

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, మాజీ ఉపప్రధాని డా. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. సంక్షేమ సంఘాలు, దళిత సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బడుగు, నిమ్న వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. అణగారిన దళిత వర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని, సమాజ సంక్షేమానికి పాటు పడాల్సిన అవశ్యకత ఉందన్నారు.

– కూకట్‌పల్లి జోన్ బృందం



జోనల్ కార్యాలయంలో డా. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్, అధికారులు, సిబ్బంది



బాలానగర్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్



రిక్షాపుల్లర్స్ కాలనీలో నివాళులర్పిస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి



ఓల్డ్‌బోయిన్‌పల్లిలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కృష్ణారావు, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ నర్సింహ



ఓల్డ్‌బోయిన్‌పల్లిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కన్నె ప్రకాశ్



ఫతేనగర్ డివిజన్ ఎల్‌బీఎస్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462
9705444132